# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 10-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారత్ ఆఫ్ఘనిస్థాన్ దేశాలు కలిసి పని చేయాల్సి ఉందని విదేశాంగ శాఖా మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు.
- భారత్‌లో తయారీ రంగం అత్యంత వేగంగా పురోగమిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాధ్ సింగ్ పేర్కొన్నారు.
- భారత్.. డిజిటలైజేషన్ దిశగా వేగవంతంగా పని చేస్తోందని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు.
- దేశ ఆర్థిక పరివర్తనకు నాయకత్వం వహించాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాపారవేత్తలకు విజ్ఞప్తి చేశారు.

====================

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారత్ - ఆఫ్ఘనిస్థాన్ దేశాలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని విదేశాంగ శాఖా మంత్రి డాక్టర్ ఎస్. జై శంకర్ అన్నారు. ఆఫ్ఘనిస్తాన్ విదేశాంగ మంత్రి మౌలవి అమీర్ ఖాన్ ముత్తకీ తో న్యూఢిల్లీలో ఈరోజు ఆయన సమావేశమై పలు అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో అన్ని రకాల ఉగ్రవాద చర్యలను ఇరు దేశాలు ఖండించాయి. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ.. పహల్గామ్ ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించినందుకు గాను ఆఫ్ఘనిస్తాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆఫ్ఘనిస్థాన్ అభివృద్ధిపై భారత్‌కు ఆసక్తి ఉందన్నారు. ఆఫ్ఘనిస్థాన్ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వాలకు భారత్ పూర్తి మద్దతునిస్తుందని, ఇరు దేశాల పరస్పర సహకారం, ఆఫ్ఘనిస్థాన్ అభివృద్ధికి, ప్రాంతీయ సుస్థిరతకు దోహదపడుతుందని పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

అనంతరం మౌలవి అమీర్ ఖాన్ ముత్తకీ మాట్లాడుతూ.. భారత్‌కు వ్యతిరేకంగా తమ దేశం ఎప్పుడూ ఎటువంటి ప్రకటనలు చేయలేదని, భారత్ తో సంబంధాలను తాము గౌరవిస్తామని చెప్పారు.

=====================

భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని రక్షణ మంత్రి రాజ్‌నాధ్ సింగ్ అన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన సిడ్నీలో ఈరోజు జరిగిన జార్జియా-ఆస్ట్రేలియా డిఫెన్స్ ఇండస్ట్రీ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో తయారీ రంగం వేగంగా పురోగమిస్తోందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో దేశ రక్షణ ఉత్పత్తి ఒక లక్షా 51 వేల కోట్ల రూపాయలను చేరుకుందని, అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 18 శాతం వృద్ధి నమోదయిందని చెప్పారు. దేశ రక్షణ ఎగుమతులు 23 వేల 622 కోట్ల రూపాయలకు చేరాయని, ప్రస్తుతం సుమారుగా 100 దేశాలకు ఎగుమతి జరుగుతోందని పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కార్యక్రమాలు పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాయని పేర్కొంటూ.. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆస్ట్రేలియా వ్యాపార రంగాన్ని ఆహ్వానించారు. భారత్, ఆస్ట్రేలియా దేశాలు సంయుక్తంగా ఆధునిక సాంకేతికతలను అభివృద్ధి చేయగలవని ఆశాభావం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

=====================

భారత్.. డిజిటలైజేషన్ దిశగా వేగవంతంగా పని చేస్తోందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. న్యూఢిల్లీలోని నేషనల్ నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా ``సుశాసన్ అవుర్ అభిలేఖ్`` పేరిట ఈరోజు నిర్వహించిన ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. దేశం ప్రస్తుతం ఒక పరిణామ దశలో ఉందన్నారు. ఈ ప్రదర్శనలో పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పాయ్, మాజీ రాష్ట్రపతి ఏపీజె అబ్దుల్ కలాంల కృషి, అభిప్రాయాలను ప్రతిబింబించే డాక్యుమెంట్లను పొందుపరచినట్టు తెలిపారు. దేశంలోని పరిపాలన, చారిత్రక రికార్డులను సంరక్షించడంలో నేషనల్ నేషనల్ ఆర్కైవ్స్ కృషిని కేంద్రమంత్రి ప్రశంసిస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

=====================

దేశ ఆర్థిక పరివర్తనకు నాయకత్వం వహించాలని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాపారవేత్తలకు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2025 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. వ్యాపార సంస్థలు కృత్రిమ మేధస్సును స్వీకరించాలని సూచించారు. పరిశోధనా రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని, అలాగే ప్రయోగాలను నిర్వహించే అవకాశాలను పెంపొందించాలని కోరారు. అంకుర సంస్థలకు సహకారం అందించాలని, MSME లకు మార్గదర్శకత్వం వహించాలని పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు.

విరామం

=====================

భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ రోజు గుజరాత్ లోని సోమనాథ మహాదేవ్ ఆలయాన్ని సందర్శించారు. గుజరాత్ రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ములోభాయ్ బేరు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జలాభిషేకం, సోమేశ్వర మహాపూజ, ధ్వజ పూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న సర్దార్ వల్లభ భాయ్ పటేల్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. సోమనాధ్ ఆలయ సందర్శన అనంతరం రాష్ట్రపతి గిర్‌లో నివసించే గిరిజన ప్రజలను కలిశారు.

====================

మానసిక ఆరోగ్య సేవలు సమయానికి అందించే వాతావరణం ఏర్పడేలా ప్రజలంతా కలిసి పని చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జె.పి.నడ్డా పిలుపునిచ్చారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఈరోజు ఆయన.. ప్రజలు తమ మానసిక సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలని ఈ దినం గుర్తు చేస్తుందని ఒక సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంపొందించడం, ప్రపంచ వ్యాప్తంగా మానసిక ఆరోగ్య సంరక్షణకు మద్దతునిచ్చే ప్రయత్నాలను ప్రోత్సహించడం లక్ష్యమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లోను, విపత్తుల సందర్భంలోను మానసిక ఆరోగ్య సేవలు అందించడం అనే ఇతివృత్తంతో ఈ సంవత్సరం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని కేంద్రమంత్రి తెలియజేశారు.

====================

భారత రాయబారిగా అమెరికా నూతనంగా నియమించిన సెర్జియో గోర్ భారత్ పర్యటన కోసం బయలుదేరారు. రాయబారిగా నియమించబడిన తరువాత భారత్‌లో ఇది ఆయన తొలి పర్యటన. 38 సంవత్సరాల సెర్జియో గోర్.. భారత్‌లో నియమించబడిన అతి పిన్న వయస్కుడైన అమెరికా రాయబారి కూడా. ఈ సందర్శనలో భాగంగా ఆయన డిప్యూటీ సెక్రెటరీ రిగాస్ తో కలిసి భారత ప్రభుత్వ ప్రతినిధులతో విస్తృత శ్రేణిలో ద్వైపాక్షిక సమస్యలపై చర్చలు జరుపుతారని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, ఇండో-పసిఫిక్ ప్రాంతానికి భద్రతను కల్పించడంలో అమెరికా భారత్‌తో కలిసి పని చేయడం కొనసాగిస్తుందని అమెరికా రాయబార కార్యాలయం వివరించింది.

====================

భారతదేశ అభివృద్ధి చర్యల్లో భాగస్వాములు కావాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బార్బడోస్‌లోని భారతీయ సమాజానికి విజ్ఞప్తి చేశారు. భారతీయ డయాస్పోరా సభ్యులతో ఈరోజు సమావేశమైన ఆయన.. రెండు ఖండాల మధ్య వారు వారధిగా నిలిచారని ప్రశంసించారు. ఈ సందర్భంగా భారత్ సాధించిన విజయాలను వారికి వివరించారు. చంద్రయాన్-3, డిజిటల్ చెల్లింపులు, AI మొదలైన వాటిని ప్రస్తావించారు. పారదర్శకత, సామర్థ్యం, జవాబుదారీతనం పెంచడానికి 'డిజిటల్ పార్లమెంట్' AI-ఆధారిత బహుభాషా సాధనాల వంటి చొరవలను అమలు చేయడంలో భారతదేశం ముందంజలో ఉందని తెలిపారు.

====================

బీహార్ శాసనసభ ఎన్నికలతో సహా పలు రాష్ట్రాల్లో జరగనున్న ఉపఎన్నికల కోసం భారత ఎన్నికల కమిషన్ (ECI) రిటర్నింగ్ అధికారుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. నిన్న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మొత్తం 243 మంది ROలు, 1,418 మంది AROలు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో నామినేషన్ ప్రక్రియ, మోడల్ ప్రవర్తనా నియమావళి, గుర్తుల కేటాయింపు, పోల్-డే ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపుతో సహా ఎన్నికల నిర్వహణలోని అన్ని దశలకు సంబంధించిన శిక్షణ ఉంటుందని కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 82,172 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరకి 328 పాయింట్లు పెరిగి 82,500 వద్ద స్థిరపడింది.

====================
====================